





## నాడు నిండైన మానేరు నేడు అడుగంటింది!

కరీంనగర్ జిల్లా పరిధిలోని మానేరు డ్యామ్ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మార్చి నెలలో నిండుగా జలకళను సంతరించుకున్నది. అన్నదాతల ఇబ్బందులను తీర్చింది. నేడు ఈ మార్చి నెలలోనే నీరు తగ్గడంతో దానిలో ఉన్న పాత రోడ్డు తేలింది. చుట్టూ గట్లు తేలి కనిపిస్తున్నాయి. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో ఎల్ఎండీ మానేరు డ్యామ్ వద్ద ఈ దృశ్యం కంటపడింది.

- నీళ్లస్తలేరని రైతుల నిరసన



ఎస్సారెస్పీ డీ-86లో నీళ్లు రావడంలేదని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల, తొగర్రాయి, జెండాపల్లి, రామునిపల్లి, మంచరామి గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. ఎండిన మక్కచేలు చూపిస్తూ ఆవేదన వ్యక్తంచేశారు. - సుల్తానాబాద్‌రూరల్

- నీళ్లులేక వాడుతున్న మామిడి తోట



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మహ్మద్ యాకూబ్ పాషా రెండెకరాలలో మామిడి తోట సాగుచేస్తున్నాడు. బోరులో నీరు అడుగంటింది. తోటను ఎండబెట్టలేక ట్యాంకర్‌తో నీరు తెచ్చి పోస్తున్నాడు. తోట మంచి కాత మీద ఉన్నదని నీరు కట్టకపోతే తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతు చెప్తున్నాడు. ఆర్థిక భారమైనా ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నట్టు తెలిపాడు. -దేవరుప్పుల

- ట్యాంకర్ నీటితోనే తడిపేది



నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం గ్రామానికి చెందిన రైతు కృష్ణారెడ్డి రెండెకరాల్లో వరి, ఎకరంలో ఉల్లి సాగు చేశాడు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడంతో బోరులో నీటిమట్టం తగ్గిపోయింది. పంటలు చేతికొచ్చే సమయంలో నీళ్లు లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని పారిస్తున్నాడు. రోజుకు రూ.2 వేలు ఖర్చు చేసి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాడు.పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని రైతు కృష్ణారెడ్డి కోరుతున్నాడు. -మరికల్

# సీమ లిఫ్ట్‌కు బ్రేక్

మొదటిపేజీ తరువాయి...

చట్టం ప్రకారం కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాత కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల, 80 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు రూ.6,829.15 కోట్లతో 2020 మే 5న ఏపీ సర్కారు జీవో జారీచేసింది. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లేలా.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేపడుతున్న ఈ కొత్త ప్రాజెక్టును పెన్నా బేసిన్‌కు కృష్ణాజలాల్ని తరలించేందుకు తెరపైకి తీసుకొచ్చారు. అదేరీతిన 15.07.2020న పెన్నా బేసిన్‌లో కాల్వల సామర్థ్య పెంపు పనులకు రూ.1,415 కోట్లతో చేపట్టేందుకు జీవో నంబర్ 388 ద్వారా పాలనా అనుమతులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో కృష్ణా బోర్డు, కేంద్రానికి అనేకసార్లు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ముందుకుపోవద్దని గతంలోనే కేంద్ర జల్‌శక్తి ఆదేశానుసారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏపీకి ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ ఏపీ టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత తెలంగాణ సర్కారు సైతం అందులో ఇంప్లీడ్ అయ్యింది. ఆ పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ఒక ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక వచ్చేవరకూ పనులను చేపట్టవద్దని, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవచ్చని ఎన్జీటీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దానిని సాకుగా చేసుకుని ఏపీ ప్రభుత్వం ఏకంగా




రాత్రి పూట లైట్ల వెలుతురులో జరుగుతున్న రాయలసీమ లిఫ్ట్ పనులు, (నిరుడు డిసెంబర్‌లో నమస్తే తెలంగాణలో వచ్చిన ప్రత్యేక కథనం)

టెండర్లను ఖరారు చేయడంతో పాటు యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి ఎన్జీటీని ఆశ్రయించింది. ప్రాజెక్టు పనులను స్వయంగా ఎన్జీటీ బృందమే సందర్శించాలని ప్రత్యేకంగా కేసీఆర్ సర్కారు అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో వాస్తవాలను తేల్చేందుకు కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఎన్జీటీ ఏర్పాటు చేయగా, పనుల విషయంలో ఏపీ ప్రభుత్వం చెబుతున్న విషయాలన్ని అబద్ధమేనని ఆ కమిటీ నివేదించింది. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుమతులు పొందేవరకూ పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీ కోసం కూడా ఎలాంటి తవ్వకాలను చేపట్టవద్దని ఏపీ ప్రభుత్వానికి 2021 డిసెంబర్‌లో ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. అయితే కొద్దిరోజుల పాటు స్తబ్ధుగా ఉన్న ఏపీ సర్కారు తెలంగాణ గత అసెంబ్లీ ఎన్నికల్లో నిమగ్నమైన వేళ ప్రాజెక్టు పనులను మళ్లీ ముమ్మరం చేసింది. ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరీ అర్ధరాత్రి వేళ పనులు కొనసాగించడంపై 'దొంగరాత్రి సీమ లిఫ్ట్ పనులు' పేరిట 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో వెంటనే ఉలిక్కిపడిన రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు వెంటనే కేంద్రానికి, ఎన్జీటీకి, కేఆర్ఎంబీకి లేఖలు రాసి ఫిర్యాదు చేసింది. మరోవైపు ఏపీ సర్కారు సైతం పనులను నిలిపివేసింది.

### అనుమతుల నిరాకరణ..

**ఫిర్యాదుల** నేపథ్యంలో ఆర్ఎల్ఐసీకి పర్యావరణ అనుమతుల మంజూరుకు తాజాగా కేంద్రం నిరాకరించింది. రాయలసీమ ఎత్తిపోత పథకానికి పర్యావరణ అనుమతుల కోసం ఏపీ సర్కారు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖకు దరఖాస్తు చేసుకున్నది. దానిపై ఇటీవల ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ)లో చర్చించారు. అంతర్రాష్ట్ర నిబంధనలను ఉల్లఘించి, పర్యావరణ అనుమతులు లేకుండానే ఏపీ సర్కారు పనులను చేపట్టిందని కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుమతులను మంజూరు చేసేందుకు కేంద్రం నిరాకరించింది. అంతేకాదు మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటే ప్రాజెక్టు స్థలాన్ని పూర్వస్థితికి తీసుకురావాలని తేల్చిచెప్పింది. కేంద్ర పర్యావరణశాఖ నిర్ణయాన్ని రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వాగతించారు.




## రుణం కట్టకపోతే భూమి వేలం వేస్తాం

- రైతు భూమిలో బ్యాంకు అధికారుల ఫ్లెక్సీ
- గ్రామంలో భూమి వేలం కరపత్రాల పంపిణీ
- భూమిని తాకట్టు పెట్టి రుణం చెల్లించిన రైతు

నెల్లికుదురు, మార్చి 15: తీసుకున్న రుణం చెల్లించాలని డీసీసీబీ అధికారులు ఓ రైతును తీవ్రంగా వేధించారు. బకాయి డబ్బులు కట్టకపోతే భూమిని వేలం వేస్తామని పొలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడమే గాక గ్రామంలో కరపత్రాలు పంచి సదరు రైతును అవమానానికి గురిచేశారు. అధికారుల తీరుతో మనస్తాపం చెందిన రైతు కొంత భూమిని కుదువ పెట్టి బ్యాంకు అప్పు తీర్చాల్సి వచ్చింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత రైతు కథనం ప్రకారం.. నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన రైతు ఆకుల కుమారస్వామికి 4.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆర్థిక పరిస్థితుల కారణంగా 2.28 ఎకరాల భూమిని లో మార్ట్‌గేజ్ చేసి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ తొర్రూరు బ్రాంచీలో రూ.5 లక్షల రుణం పొందాడు. రూ.3.75 లక్షల వరకు అప్పు తీర్చాడు. గతేడాది నుంచి ఆశించిన మేర దిగుబడి రాక, ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీ కాక, రైతుభరోసా జమ కాకపోవడంతో తీసుకున్న రుణం చెల్లించలేకపోయాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఇప్పుడు చెల్లించలేనని, పంట అమ్మి రుణం చెల్లిస్తానని బతిమిలాడినా బ్యాంకు అధికారులు వినలేదు. నోటీసులు జారీ చేసి రైతు భూమిలో 'ఈ భూమిని వేలం వేయుటకు స్వాధీన పర్చుకోవడమైనది' అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ నెల 18న నైనాల గ్రామ పంచాయతీ వద్ద వేలం వేస్తామని కరపత్రాలు పంచిపెట్టారు. ఈ చర్యతో సదరు రైతు గుండె ఆగినంత పనైంది. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన మొత్తం 4.15 ఎకరాల్లో 1.27 ఎకరాలు తాకట్టు పెట్టి రూ.5 లక్షలు అప్పుతెచ్చి రుణం చెల్లించాడు. కరపత్రాలు పంచిన ఖర్చు రూ.2 వేలు కూడా రైతుపైనే వేశారు.

- పంటలెండుతున్నా పట్టించుకోరా?



నవీపేట, మార్చి 15: సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయనినిజామాబాద్ జిల్లా నవీపేట మండలం లింగాపూర్‌కు చెందిన రైతు కోరే నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. ఎనిమిదిన్నర ఎకరాల్లో వేసిన వరి పొట్టదశలో ఉండగా జన్నేపల్లి వాగులో నీటిచుక్క లేక బోర్లు పోయడం లేదని, పంట ఎండిపోతుండటంతో ఆవేదనకు గురైన ఆయన సెల్ఫీ వీడియోలో తన గోడువెల్లబోసుకున్నాడు. 'జన్నేపల్లి వాగు ఎండిపోయింది. వాగులో రైతుల బోర్ల నుంచి నీళ్లు అస్తలేవు. పొట్టదశలో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. గతంలో వాగులో చెలిమె తవ్వి నీళ్లను తాగేవాళ్లం. ప్రస్తుతం పశువులకు సైతం చుక్కనీరు లేదు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకుంటలేరు. కాంగ్రెసోళ్లకు ఫోన్ చేస్తే స్పందిస్త లేరు' అని ఆయన వాపోయాడు.


- మోతెను కరువు మండలంగా ప్రకటించాలి



మోతె, మార్చి 15 : ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయిన సూర్యపేట జిల్లా మోతెను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. మండలంలోని బీక్యాతండాలో ఎండిన వరి పొలాలను ఆ పార్టీ ప్రతినిధి బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరు అందకపోవడంతో మండలంలో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం ఎండిన పంటలకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో మండలవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# దిగుబడి నాటికీ 'పెట్టుబడి' రాలే!

- రేపోమాపో వరి కోతలు ప్రారంభం
- ఇప్పటికీ మూడెకరాలకే రైతుభరోసా
- ఇప్పటిదాకా 44.82 లక్షల మందికే
- మిగతావారికి ఇస్తరో, ఇయ్యరో?
- నెల రోజులుగా పైసా జమ కాలె
- రైతన్నలకు రూ.5,512 కోట్లు బాకీ
- ఆశగా ఎదురుచూస్తున్న రైతులు



యాసంగిలో పంపిణీ చేసిన రైతుభరోసా (రైతులు-లక్షల్లో, పంపిణీ - రూ.కోట్లు)

| తేదీ | రైతుల సంఖ్య | పంపిణీ | ఎకరాలు |
|---|---|---|---|
| జనవరి 27 | 4.41 | 568.99 | పైలట్ గ్రామాలు |
| ఫిబ్రవరి 5 | 17.03 | 557.54 | ఒక ఎకరం |
| ఫిబ్రవరి 10 | 13.23 | 1091.95 | రెండెకరాలు |
| ఫిబ్రవరి 12 | 0.56 | 0.38 | రెండెకరాలు |
| ఫిబ్రవరి 12 | 9.56 | 1230.98 | మూడెకరాలు |
| మొత్తం | 44.82 | 3487.82 | -- |

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు రైతుభరోసా పంపిణీని మర్చిపోయింది. నెల రోజులుగా రైతుల ఖాతాల్లో నయా పైసా జమ చేయలేదు. గత నెల 12వ తేదీన మూడెకరాల రైతులకు రైతుభరోసా జమ చేసినట్టు ప్రకటించిన సర్కారు... అక్కడితో పెట్టుబడి పంపిణీకి ఫుల్‌స్టాప్ పెట్టేసింది. మూడెకరాల కంటే ఎక్కువ భూములున్న రైతులకు భరోసా పంపిణీ గురించి ప్రభుత్వం ఊసెత్తడం లేదు. కనీసం ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్కారు నిర్లక్ష్యంపై అన్నదాతలు మండిపడుతున్నారు.



మొత్తం రైతుల సంఖ్య **70 లక్షలు**

ఇప్పటివరకు ఇచ్చిన రైతుల సంఖ్య **44.82 లక్షలు**

మిగిలిన రైతుల సంఖ్య **25.18 లక్షలు**

మొత్తం రైతుభరోసా- రూ.9 వేల కోట్లు

ఇప్పటివరకు ఇచ్చింది- రూ.3,487.82 కోట్లు

ఇంకా ఇవ్వాల్సింది- రూ.5512.18 కోట్లు

### మూడెకరాలు.. ఐదు విడతలు

వానకాలం రైతుభరోసాను పూర్తిగా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు యాసంగి పెట్టుబడిసాయం పంపిణీలోనూ ఎగవేత ధోరణి అవలంబిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడెకరాల రైతులకు మాత్రమే రైతుభరోసా అందించింది. ఇందులో కూడా కొంతమందికి రైతుభరోసా అందలేదనే ఫిర్యాదులున్నాయి. ఇప్పటివరకు పంపిణీ చేసిన మూడెకరాలకు ఐదు వాయిదాల్లో జమ చేయడం గమనార్హం. మిగతా రైతులకు రూపాయి కూడా జమ కాలేదు. అసలు ఇస్తారో, ఇవ్వరో కూడా తెలియడం లేదు.

### కోతలు మొదలైనా...

బీఆర్ఎస్ సర్కారు పంటల సాగుకు ముందే రైతుబంధు అందించేది. తద్వారా రైతులకు పెట్టుబడులకు ఆసరాగా నిలిచేది. కానీ, కాంగ్రెస్ సర్కారు మాత్రం నాట్ల సమయంలో ఇవ్వాల్సిన రైతుభరోసాను వరి కోతలు మొదలవుతున్నా ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మరో వారం పది రోజుల్లో వరి కోతలు మొదలుకానున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి చేపట్టాక వచ్చిన గత యాసంగి సీజన్‌లోనూ కోతలు పూర్తయ్యేనాటికి సాయం పెంచకుండా పాత రైతుబంధునే జమ చేసింది. ఇక మొన్నటి వానకాలానికి సంబంధించి పూర్తిగా ఎగనామం పెట్టింది. ఇప్పుడు కోతలు ప్రారంభమవుతున్నా.. ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వడం లేదు.

# సీఎం రేవంత్ క్షమాపణలు చెప్పాల్సిందే

- అసెంబ్లీలో జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడం దారుణం
- సరైన సమయంలోప్రజలు తగిన గుణపాఠం చెప్తరు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్



హైదరాబాద్, మార్చి 15: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి భాషను తెలంగాణ సమాజమంతా వ్యతిరేకిస్తున్నదని, కాబట్టి తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హుందాగా రాజకీయాలు చేస్తున్నదని, ముఖ్యమంత్రి ప్రయోగించిన భాషను తాము ప్రయోగించలేమని స్పష్టంచేశారు. సభలో సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన అనంతరం శాసనమండలి ఆవరణలో మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, షేరి సుభాశ్‌రెడ్డి తదితర సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఆ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే బట్టలు ఊడదీసి ఊరేగిస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఇది చీకటి రోజని స్పష్టం చేశారు. సరైన సమయంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

**తెలంగాణకే మాయనిమచ్చ: దేశపతి శ్రీనివాస్**



తెలంగాణ సమాజానికి మాయని మచ్చగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శాసనమండలి ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమసారథి, తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలను తెలంగాణ సమాజమంతా ఖండిస్తున్నట్టు చెప్పారు.

**అసహనంతోనే అనుచిత వ్యాఖ్యలు: కొప్పుల**



ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజావ్యతిరేకతను తట్టుకోలేని సీఎం రేవంత్‌రెడ్డి అసహనంతో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. 6 గ్యారెంటీలు అమలుచేయడం చేతగాని ఆయన ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారని ఆక్షేపించారు.

**సభ్యసమాజం సిగ్గుపడేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.**



మల్కాజిగిరి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సీఎంవి దిగజారుడు రాజకీయాలు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి .. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

మల్కాజిగిరి, మార్చి 15 : సీఎం రేవంత్‌రెడ్డివి దిగజారుడు రాజకీయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సీఎం తీరును నిరసిస్తూ శనివారం మల్కాజిగిరి చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యవహరిస్తున్నారని, తెలంగాణ సమాజాన్ని అవమానపరుస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు వెంకన్న, రామచర్ల నర్సింగ్, కార్పొరేటర్ సునీతారాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్‌ది భాషాదారిద్ర్యం :బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద**



సీఎం రేవంత్‌ది భావదారిద్ర్యం, భాషాదారిద్ర్యం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. సీఎం రేవంత్ తన ప్రసంగంలో ప్రభుత్వ పనితీరు గురించి చెప్పాల్సి ఉండగా, అది మరిచి కేవలం కేసీఆర్, ఆయన కుటుంబంపై విమర్శలకే సమయం కేటాయించారని మండిపడ్డారు.